# అత్యాచార నిందితులను బహిరంగంగా ఉరితీయాలి

## ఏఐఎస్‌బీ, పీఎస్‌యు విద్యార్థి సంఘాల డిమాండ్

**కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 17(ప్రభన్యూస్):** కలకత్తాలో జూనియర్ డాక్టర్ పై అత్యాచారం చేసి అతి క్రూరంగా దాడి చేసి హత్య చేసిన వారిని బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏ ఐ ఎస్ బి, ప్రగతిశీల విద్యార్థి సంఘం పిఎస్యు ఆధ్వర్యంలో కడప నగరంలోని శంకరాపురం లో ఉన్న వసతి గృహం నందు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, పిఎస్యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడులు మాట్లాడుతూ కలకత్తాలో జూనియర్ డాక్టర్ పై జరిగిన దాడి చాల బాధాకరం అని ఆవేద వ్యక్తం చేశారు.చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు మహిళలకు ఇంట బయట రక్షణ లేదని ఇందుక ు నంద్యాల జిల్లాలోని ముచ్చుమర్రిలో మైనర్ బాలురు మైనర్ బాలికపై చేసిన అత్యాచారం, కలకత్తాలో మెడికల్ విద్యార్థినిపై జరిగిన అత్యాచారాలు నిదర్శణం అని ఆవేదన వ్యక్తం చేశారు. కలకత్తాలో జరిగిన జూనియర్ డాక్టర్ అత్యాచారం మరియు హత్యలో నిందితుడు ఒక్కరే కాదు అనేకమంది ఉన్నట్లుగా ఆమె పోస్టుమార్టం రిపోర్టులో స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు. కానీ సంఘటన స్థలానికి చేరిన పోలీసులు మరియు అర్జీ కార్ ప్రిన్సిపల్ ఆమెది ఆత్మహత్య అని ఆమె తల్లిదండ్రులకు తెలియజేయడం ఎన్నో ప్రశ్నలకు దారితీస్తుందని అన్నారు. కావున జూనియర్ డాక్టర్ అత్యాచారం మరియు హత్యలో కీలక వ్యక్తులు ఉన్నారని అనుమానం దేశ ప్రజలకు అర్థమవుతుందని తెలిపారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి ఒక మహిళా ముఖ్యమంత్రిగా ఉంటూ, మహిళలకు అన్యాయం జరిగితే ఇంతవరకు నిందితులను పట్టుకోలేని స్థితిలో ఉండటం చాలా దుర్మార్గమని వారు వాపోయారు.జూనియర్ డాక్టర్ గారి కేసును సిబిఐ కు బదిలీ చేసి చేతులెదులుకోకుండా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గారు ఆ కేసు బాధితురాలికి న్యాయం చేయాలని అదేవిధంగా జూనియర్ డాక్టర్‌ని అతి కిరాతకంగా అత్యాచారం అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కనుగొని వారిని కూడా అతికిరాకంగా బహిరంగంగా శిక్షిస్తేనే మరొకరు ఇలాంటి సంఘటనలు చేయకుండా ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. లేకుంటే దేశవ్యాప్తంగా విద్యార్థి యువజన ప్రజాసంఘాలు అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన త్రీవతరం చేస్తామని హెచ్చరించారు.




విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

# కడప జడ్పీటీసీలకు వైసీపీ పిలుపు

**కడప బ్యూరో - ప్రభ న్యూస్ :** రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించింది. వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను టిడిపిలో చేర్చుకుంటూ స్థానిక సంస్థలను ఆ పార్టీ కైవసం చేసుకుంటోంది. ఇప్పటికే పలు మున్సిపాల్టీలను తమ ఖాతాలో వేసుకుంది. ప్రభుత్వం మారిన తర్వాత.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొందరు ప్రజాప్రతినిధులు, నేతలు.. అధికార టీడీపీ కూటమి వైపు చూస్తున్నారు. కడప జిల్లాలో కూడా ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్లు టిడిపి లో చేరిపోయారు. కడప కార్పొరేషన్ తో పాటు మైదుకూరు, జమ్మలమడుగు మున్సిపాలిటీల్లో కూడా వైసీపీ కౌన్సిలర్లు టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో వైసిపి అధిష్టానం అలర్ట్ అయ్యింది. ప్రధానంగా జిల్లా పరిషత్ చేజారి పోకుండా ఉండేందుకు ఆ పార్టీ నేతలు ముందస్తు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీంతో ఉమ్మడి కడప జిల్లాలోని జడ్పీటీసీలతో చర్చించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలోని జడ్పీటీసీలు అందరూ ఈ నెల 21వ తేదీన విజయవాడకు రావాలంటూ అధిష్టానం నుంచి పిలుపు వెళ్లింది. పార్టీ అధినేత, మాజీ సీఎం వైయస్ జగన్ ప్రత్యేకంగా సమావేశం అవుతారని తెలుస్తోంది.

అయితే.. జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి రాజీనామా విషయం తెలిసిందే. ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్ గా ప్రొద్దుటూరు జెడ్పిటిసి శారద ఇన్ ఛార్జ్ గా కొనసాగుతున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. దీంతో.. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి చేజారకుం డా వైసీపీ కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగానే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది.

కడప జిల్లాలో మొత్తం 50 జడ్పీటీసీ స్థానాలు ఉండగా వాటిలో రెండు ఖాళీగా ఉన్నాయి. 48 జడ్పీటీసీ సభ్యులలో ఒక గోపవరం మినహా అందరూ వైసీపీ జడ్పీటీసీలే. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదురు జడ్పీటీసీలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. అదేవిధంగా మరో జడ్పీటీసీ బీజేపీ గూటికి చేరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరింత మంది జడ్పీటీసీలు చేజారకుండా, కడప జెడ్పీ చైర్మన్ పదవి కూడా దూరంగా కాకుండా పావులు కదుపుతోంది వైసీపీ అధిష్టానం. అందులో భాగంగా జడ్పీటీసీలు అందరిని ఈనెల 21న విజయవాడకు రమ్మని పిలుపునిచ్చారు. ఇక, విజయవాడలో జడ్పీటీసీలతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రత్యేకంగా సమావేశం అవుతారని తెలుస్తోంది. ఈ సమావేశంలోనే జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిని ఎన్నుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైసీపీ నేతలు ఈ పదవిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఒకరిద్దరి నేతల పేర్లు వినిపిస్తున్నా వారికి రాజకీయ ఎదుగుదల ఉంటుందని భావించిన వైసీపీ కీలక నేతలే వారిని అణగతొక్కే ప్రయత్నం చేస్తున్నట్లు ఆ పార్టీలోనే చర్చ సాగుతోంది. ఈ పరిస్థితిలో జిల్లా పరిషత్ చైర్మన్ అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేస్తారో ఆసక్తికరంగా మారింది. మరోవైపు తెలుగుదేశం పార్టీ కూడా పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. ఇప్పటికే చాలామంది జడ్పీటీసీలు టిడిపి నేతలతో టచ్ లో ఉన్నట్లు సమాచారం. దీంతో ప్రస్తుత సమావేశంపై అటు వైసీపీ, టిడిపిలో ఆసక్తికర చర్చ సాగుతోంది.

# స్టెత్ డౌన్... స్తంభించిన వైద్యం!

**కడప బ్యూరో - ప్రభ న్యూస్ :** కోల్‌కత్తా ఆర్.జీ.కర్ ప్రభుత్వ కళాశాల ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న మహిళా వైద్యురాలిపై అమానుషంగా అత్యాచారం.. హత్య చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ సంఘటనను నిరసిస్తూ ఇప్పటికే జూనియర్ డాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వారికి మద్దతుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) 24 గంటల పాటు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు డాక్టర్లు శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు సమ్మెలో పాల్గొంటున్నారు. అత్యవసర సేవలు మినహా ఓపీ పూర్తిగా నిలిపివేయాలని నిర్ణయించారు. ఐఎంఎ పిలుపుమేరకు కడప జిల్లాలో వైద్యులందరూ సమ్మెలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన కడపలో రిమ్స్ ఆవరణంలో జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు విధులను బహిష్కరించి నిరసనలు కొనసాగించారు. అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా కొంతమంది వైద్యులు అందుబాటులో ఉంటూనే జూనియర్ డాక్టర్ల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. వైద్యుల సమ్మె కారణంగా రిమ్స్ లో ఓపి నామమాత్రంగానే సాగింది. వైద్యులతో పాటు పారామెడికల్ సిబ్బంది కూడా సమ్మెకు మద్దతు ప్రకటించారు. దీంతో రిమ్స్ ఆస్పత్రి బోసిపోయి కనిపించింది. రిమ్స్ హాస్పిటల్ లో జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసనకు ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి పూర్తి సంఘీభావం తెలిపారు. అదేవిధంగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్ శ్రీనివాసరెడ్డి(వాసు)తోపాటు నాయకులు అమీర్ బాబు మరి కొంతమంది నేతలు కూడా వైద్యుల నిరసనలకు మద్దతు తెలిపారు.



వెల వెల బోతున్న ఓపీ కౌంటర్



ఓపీ విభాగం

అదేవిధంగా కడప పట్టణంలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో శనివారం ఉదయం నుంచి ఓపి నిలిపివేశారు. చాలా ప్రాంతాల్లో 24 గంటల పాటు వైద్య సేవలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్లెక్సీలు పెట్టారు. గేట్లు మూసివేశారు. ఇక ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కూడా వైద్య సిబ్బంది 24 గంటల పాటు విధులను బహిష్కరించి, నిరసన వ్యక్తం చేశారు. ఓపిని బంద్ చేశారు. ప్రొద్దుటూరు ఐఎంఎ ఆధ్వర్యంలో జమ్మలమడుగు రోడ్డులోని ఐఎంఎ హాలు వద్ద నుంచి శివాలయం సెంటర్ వరకు వైద్యులు ర్యాలీ నిర్వహించారు. ఇక జమ్మలమడుగులో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నిరసన ర్యాలీ నిర్వహించారు. పులివెందులలో జనరల్ ఆసుపత్రి వైద్యులు, మెడికల్ కళాశాల వైద్యులు, సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. అయితే రోగులకు ఇబ్బంది కలగకుండా నల్ల బ్యాడ్జీలు ధరించి వైద్య సిబ్బంది విధులకు హాజరయ్యారు. ఇలా జిల్లాలోని అన్ని మండలాలలో కూడా ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు నిరసన ర్యాలీలు చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపిలు నిలిపివేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.

**కడపలో భారీ నిరసన ర్యాలీ..**

కడప పట్టణంలో ఐఎంఏ ఆధ్వర్యంలో వైద్యులు, జూనియర్ డాక్టర్లు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. ఆసుపత్రులలో డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి తగిన రక్షణ కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక రక్షణ చట్టాలు కేంద్ర స్థాయిలో తీసుకురావాలని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వైద్య సిబ్బంది రక్షణ చట్టాన్ని సవరించి కఠిన తరం చేయాలని ఐఎంఏ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

## కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి

**కడప రూరల్ ఆగస్టు 17 (ప్రభ న్యూస్):** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నగరంలోని ఎస్టేట్ రోడ్డు లోని జూనియర్ కాలేజీలో శనివారం మొక్క నాటి నీళ్ళు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షిస్తే, ఏడాదికల్లా నగర వనంలా, నగరం పచ్చదనం పరుచుకుంటుందన్నారు. ఎక్కడైతే చెట్లు ఉంటాయో అక్కడ మేఘాలు వర్షిస్తాయని చెప్పారు. రోజురోజుకు పెరుగుతున్న వాహన వినియోగం వల్ల గాలి కాలుష్యం అవుతుందని, గాలి కాలుష్యాన్ని హరించే గుణం ఒక చెట్టుకే ఉందన్నారు. గాలి కాలుష్యం వల్ల శ్వాసకోశ సంబంధమైన వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ అన్నారు. ధనమున్న రోగి కన్నా, ఆరోగ్యంగా ఉన్న పేదవాడే ధనవంతుడని చెప్పారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్కను నాటి సంరక్షించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ముక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే మాధవి

# ఖాజీపేట సీఐగా ఆర్ మోహన్ బాధ్యతల స్వీకరణ

**ఖాజీపేట, ఆగస్టు 17(ప్రభ న్యూస్):** ఖాజీపేట మండల సీఐగా ఆర్ మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు, స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగత పలికారు, ఈ సందర్భంగా సిఐ మోహన్ మాట్లాడుతూ ఎల్లవేళలా ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను కలిసి పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు సాగిస్తున్నారని తెలిస్తే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు,




# అదమరిస్తే..అంతే సంగతులు

**కడప కార్పొరేషన్, ఆగస్టు 17 (ప్రభన్యూస్):** కడప నగరంలోని వై జంక్షన్ నుంచి పాత బైపాస్‌కు వెళ్లే మార్గంలో నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో సుబ్బిరెడ్డి డిగ్రీ కాలేజి నుండి మురికి కాలువ ప్రమాదకరంగా మారింది. నగర పాలక సిబ్బంది ఇక్కడ ఎటువంటి రక్షణ గోడ ఏర్పాటు చేయలేదు. పొరపాటున వాహనదారులు అదుపుతప్పిదే నేరుగా కాలువలో పడిపోతారు. కాలువ పక్కన ఉన్న వీధుల్లో నివాసాలున్నాయి. పిల్లలను బయటకుపంపాలంటే భయం వేస్తోందనిస్థానికులు వాపోతున్నారు. గతంలో ఇదేకాలువలో అనేక మూగ జీవాలు పడ్డ సందర్భాలున్నాయని స్థానికులు తెలిపారు. మురికివద్ద ఒక వైపు రోడ్డు పూర్తిగా కుంగిపోతుండడంతో రాత్రి వేళల్లో ఆ దారిలో వెళ్లాలంటే చాలా ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి దెబ్బతిన్న కాలువలకు మరమ్మత్తులుచేయాలనిస్థానికులు కోరుతున్నారు.



దెబ్బతిన్న కాలువ

**శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**

సమోదిత కార్యాలయం : 501, సల్కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ - 110025

సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్‌సి366027

**వేలం ప్రకటన**

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికి వారిచే సర్దుబాటు చేయబడలేదు రుణగ్రహీతలందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలు పొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా 28.08.2024న మ॥03.00గం॥లకు వేలం తేదీగా నిర్ణయించబడినది. రుణగ్రహీతలతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

| శాఖ | ఖాతా నెం. | ఖాతాదారుని పేరు | తండ్రి/ భర్త లేదా భార్య పేరు | చిరునామా | ఖాతా తెరచిన తేది | చెల్లించవలసిన మొత్తం |
|---|---|---|---|---|---|---|
| జూబ్లీహిల్స్ | 103942510778 | బోనాల పి.మనోజ్ | తండ్రి దేవలంపేట బోనమల | 4/37, కేశవపురం, చిన్నమండెం, కడప, ఆంధ్రప్రదేశ్ -516214 | 18/03/2024 | 174009.18 |

**వేలం తేది : 28.08.2024న మ॥03.00గం॥లకు**

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.

సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్